క్లుప్తంగా

పాలకొల్లు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగదేవి


నాగదేవి

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా కట్టా నాగదేవి బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగదేవి డిప్యుటేషన్‌పై నరసాపురం ఎలక్షన్ డీటీగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించినట్లు ఆదివారం విలేకరులకు నాగదేవి తెలిపారు. ఇప్పటివరకూ తహసీల్దార్‌గా పని చేసిన జి.మమ్మి పదోన్నతిపై ఒంగోలుకు బదిలీ అయ్యారు.

పుంతలో ముసలమ్మ ఆలయంలో అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రామగుండం పార్క్ వద్ద సంక్రాంతి పండుగలో నిర్వహించిన శ్రీ పుంతలోముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఇటీవల ముగిశాయి. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పిన్ని ఉప్పరి, పిన్ని వేణుగోపాలస్వామి, కమిటీ సభ్యులు గజ్జరపు రాజా, వంకా రామకృష్ణ, నేదునూరి సూరిబాబు, పేర్ల రాము, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్ను విజయ్, రేలంగి శ్రీను, గంటా నరేష్, తలువూరి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో పూర్వ విద్యార్థుల సందడి


కొబ్బరితోటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న వట్టం గణేష్

మొగల్తూరు: పాలకొల్లు బీఆర్‌ఎంవీఎల్‌హెచ్ స్కూల్‌లో 1981లో విద్యనభ్యసించిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కేపీ పాలెం బీచ్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లను నెమరవేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఏర్పాటు చేసుకున్న సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వట్టం గణేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సామాజిక, ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టేందుకు మీరంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కంకిపాటి సాంబశివరావు, నిట్ట రమేష్, పిల్లా శ్రీనివాస్, ఆర్‌వీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుని పల్లకి ఉత్సవం


జుత్తిగలో శ్రీషిర్డీసాయిబాబా పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ గ్రామంలోని శ్రీషిర్డీసాయిబాబా దేవాలయం 23వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయిబాబా వారి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై బాబావారిని దర్శించుకుని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా చినబాబు జయంతి


చినబాబుకు నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుగొండ: మాజీ శాసన సభ్యుడు కూనపరెడ్డి వీర రాఘవేంద్రరావు(చినబాబు) జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం పెనుగొండలోని చినబాబు విగ్రహానికి కృష్ణదేవరాయ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. చినబాబు సేవలను కొనియాడారు. సంఘ నాయకులు మంగెన బాబీ, పప్పొప్పుల బుజ్జి, రామకృష్ణ, సూర్నీడి కృష్ణ, భూపతి శ్రీను, వెంకయ్య, బండారు నాయుడు పాల్గొన్నారు.

31 నుంచి గోస్తనీ తీర్థోత్సవాలు

పాలకోడేరు: శ్రీ గోస్తనీ నది 92వ తీర్థోత్సవాలను ఈ నెల 31 నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా 31 ఉదయం నుంచి ఏకాహం, భజనలు, 1 ఉదయం నుంచి అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యులతో కోదండరామ కల్యాణం, శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, 10 గంటలకు కోలాటం, 11 గంటలకు అన్న సమారాధన రాత్రి 8 గంటలకు శ్రీ అల్లూరి సీతారామరాజు సినిమా ప్రదర్శన ఏర్పాటు చేశారు.

తీర ప్రాంత గ్రామాల్లో తీరనున్న విద్యుత్ వెతలు

- కొత్తగా మరో 3 ఇంటర్నల్ సబ్‌స్టేషన్లు
- ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 220/132/11 కేవీ భారీ సబ్‌స్టేషన్
- ఇక లో-ఓల్టేజ్ సమస్యలకు చెక్
- ఆక్వా రైతులకు మేలు


నరసాపురం పట్టణంలోని ప్రస్తుత విద్యుత్ సబ్‌స్టేషన్

నరసాపురం: నరసాపురం తీరగ్రామాల్లో రానున్న 30 ఏళ్లపాటు నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బీజం వేసింది. ఇప్పటికే నరసాపురం పట్టణంతో పాటుగా పాలకొల్లు, భీమవరం చుట్టుపక్కల గ్రామాల్లో కూడా విద్యుత్ లో-ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో రుస్తుంబాదలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. మళ్లీ తాజాగా మూడు సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో శ్రీకారం చుట్టారు. నరసాపురం అర్బన్‌లో జగనన్న కాలనీకి ప్రత్యేకంగా రూ.2.60 కోట్లుతో 33కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. వీటి పనులు ప్రారంభమయ్యాయి. అలాగే నవరసపురం, చిట్టవరం గ్రామాలకు సంబంధించి రూ.2.40 కోట్లతో 10 ఎంవీ సబ్‌స్టేషన్, మొగల్తూరు మండలం కాళీపట్నం, జగన్నాథపురం గ్రామాలకు సంబంధించి రూ 2.40 కోట్లతో 10 ఎంవీ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ఈ రెండు సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలు కూడా కొన్ని రోజుల్లోనే ప్రారంభం కాబోతున్నాయి.

2019 వరకూ 50 ఎంవీ సామర్థ్యంతో మాత్రమే

2019లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నంత వరకూ నియోజకవర్గంలో మొత్తం 50 ఎంవీ సామర్థ్యంతో మాత్రమే సబ్‌స్టేషన్‌లు అందుబాటులో ఉండేవి. దీంతో తీర గ్రామాలకు విద్యుత్ వెతలు వర్ణనాతీతంగా ఉండేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 5 ఎంవీ సామర్థ్యంతో ఉండే మొగల్తూరు, కొత్తోట, ఎల్‌బీచర్ల, తూర్పుతాళ్లు, కేపీపాలెం గ్రామాల్లోని 5 సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని 10 ఎంవీకి రెట్టింపు చేస్తూ అభివృద్ధి చేసింది. నరసాపురం పట్టణంలో ఉండే 132/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కు అదనంగా మరో 80 సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి మొత్తం 130 ఎంవీఏకు పెంచారు.

అందుబాటులోకి 400 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు

ఇప్పుడు అదనంగా ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేసిన మరో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. అంటే 2019లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కేవలం 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఏకంగా 400 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు అభివృద్ధి చెందుతున్నాయి. కొత్తగా నిర్మిస్తున్న 220/132/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి నరసాపురం, పాలకొల్లు, భీమవరం, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ఇక్కడి నుంచే విద్యుత్ సరఫరా సాగనుంది. ఇక ఇటీవల కాలంలో ఒక్క నరసాపురం నియోజకవర్గంలోనే 200మంది ఆక్వారైతులకు వారి అభ్యర్థన మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చారు. ఆక్వా రంగాన్ని కూడా అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో నిర్మాణాలు పూర్తి



కొత్తగా నరసాపురం నియోజకవర్గంలో రూ.7.40 కోట్లుతో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి కావంతో పట్టణంలోని జగనన్న కాలనీలో ఓ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సీఎం శంకుస్థాపన చేసిన రుస్తుంబాదలో రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 220/132/11 కేవీ సబ్‌స్టేషన్ పనులు కూడా మొదలవుతున్నాయి. నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, భీమవరం, యలమంచిలి మండలాల ప్రజలకు రానున్న 30 ఏళ్లపాటు ఇక ఎలాంటి విద్యుత్ కష్టాలు ఉండవు. నరసాపురం తీర గ్రామాలోని 5 సబ్ స్టేషన్‌లలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేశాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

శాకాహారమే అమృతాహారం


శాకాహార ర్యాలీని నిర్వహిస్తున్న ధ్యానులు

నరసాపురం రూరల్: శాకాహారమే అమృతాహారమని, శాకాహారం తీసుకుని ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీనియర్ మాస్టర్‌లు మేకా వెంకటేశ్వరరావు, పెద్దివర్మలు అన్నారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆఫ్ ఇండియా నరసాపురం శాఖ ఆధ్వర్యంలో వైఎన్ కళాశాలలో నిర్మించిన మైత్రేయ పిరమిడ్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన మహాకరుణ శాకాహార ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. ధ్యానం వల్ల ఏకాగ్రత కలుగుతుందని, మానసిక ఆందోళనను విడిచి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు శాకాహారం తినడం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు, మాంసాహారం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. తొలుత పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు రాయపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేవీ శైలజ, తాడిమేటి కృష్ణవేణి, భాస్కరరావు, కేవీడీ ప్రసాద్, ఆగర్తిపాలెం నాగ శ్రీను, అమలాపురం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో వ్యాస రచనలకు ఆహ్వానం

పెంటపాడు: తెలుగు సాహిత్యం, కథలు, కవిత్వాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. ఫిబ్రవరిలో మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని డిగ్రీ, పీజీ విద్యార్థులకు అవగాహన కోసం జాతీయ స్థాయి వ్యాసాలు రాసేందుకు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు సామాజిక పత్రిక అయిన ప్రకాశిక, పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సందర్భంగా 10 అత్యుత్తమ వ్యాసాలకు రూ.1000 నగదు ప్రోత్సాహం, అభినందన సత్కారంతో పాటు, 50 వ్యాసాలను ఎంపిక చేసి పుస్తక రూపంలో ప్రచురిస్తామన్నారు. వ్యాసాలను ఫిబ్రవరి 15లోపు పంపాలన్నారు. పూర్తి వివరాలకు పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగంలో లేదా 94926 38547 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ప్రమోద్‌కుమార్‌కు సత్కారం


ప్రమోద్‌కుమార్‌ను సత్కరిస్తున్న మునిసిపల్ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: మునిసిపల్ కార్యాలయ సిబ్బంది, పట్టణ ప్రజల సహకారంతో పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పాలకొల్లు మాజీ కమిషనర్ నెల్లుట్ల ప్రమోద్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కార సమావేశం ఏర్పాటు చేసి ప్రమోద్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, ఇంజినీర్ సాంబశివుడు, టీపీఓ వీరబ్రహ్మం, ఆర్‌ఐ శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, కుమార్ రాజా, సీఎంఎం రత్నాకర్, ఏఈలు సతీష్ పాల్గొన్నారు.

ఛాంబర్స్ కళాశాలలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్


ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న కళాశాల యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్‌లో వివిధ పోటీ పరీక్షలకు ఒక నమూనాగా ఈ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు తెలిపారు. ఆదివారం బీఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ డిగ్రీ అండ్ పీజీ ఛాంబర్స్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజులో పూర్తి రాయితీ ఇస్తామని అలాగే 85 శాతం మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీని కల్పిస్తామని అన్నారు. అలాగే ఈ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ ప్రోత్సాహకాలు సుమారు రెండు లక్షల రూపాయల వరకూ ఉంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యాధునికమైన లాబ్స్, ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన, ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓల్గా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ దేవరపు లక్ష్మీనారాయణ, అకాడమిక్ అడ్వైజర్ ఏబీఎస్ మూర్తి, ఎస్ సీతారామారావు, ట్రెజరర్ జల్లూరి రామలింగేశ్వరరావు, వినుకొండ రంగారావు, మద్దుల కిరణ్, నెలకుర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గీతాసారాన్ని తెలుసుకోవాలి


త్రైత సిద్ధాంత భగవద్గీత పై ప్రచారం నిర్వహిస్తున్న హిందూ ధర్మ ప్రబోధకులు

యలమంచిలి: ప్రతి ఒక్కరూ తమ ఇష్ట దైవాన్ని పూజించడమే కాకుండా భగవద్గీత సారాన్ని గ్రహించి కర్మ విధానం తెలుసుకుని ఆచరించడం ద్వారా మోక్షం పొందాలని ప్రబోధ సేవా సమితి మామిడికుదురు కమిటీ అధ్యక్షులు బండారు సత్యనారాయణ చెప్పారు. కనకాయకలంక గ్రామంలో ఆదివారం కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత పై ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి త్రైత సిద్ధాంతం గురించి వివరించారు. ప్రతి ఒక్కరికీ ఆత్మ, జీవాత్మ, పరమాత్మల సారం తెలపడమే త్రైత సిద్ధాంత భగవద్గీత పై ప్రచారం నిర్వహిస్తున్న హిందూ ధర్మ ప్రబోధకుల లక్ష్యమన్నారు. భగవద్గీతను చదవడం ద్వారా ఆత్మజ్ఞానాన్ని పెంచుకుని జ్ఞానులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుజ్జి, బ్రహ్మాజీ, వెంకటకృష్ణ, అన్నపూర్ణ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

యలమంచిలి: మండలంలోని 23 గ్రామ సచివాలయాల కన్వీనర్ల సమావేశం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు దొడ్డిపట్లలో ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు, సచివాలయాల మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో దొడ్డిపట్ల హైస్కూల్ పక్కనున్న కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి 23 సచివాలయాల కన్వీనర్లు హాజరు కావాలని వారు కోరారు.

ప్రాణ త్యాగంతో లోకానికి శాంతి మార్గం


ప్రవచనకారుడు నందూరు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ గోవిందరాజులు

పెనుగొండ: హింసకు తావివ్వకుండా ప్రాణత్యాగాన్ని చేసి లోకానికి శాంతి మార్గాన్ని చూపి వాసవీ కన్యకపరమేశ్వరి విశ్వమాత అని కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన ప్రముఖ ప్రవచన కారుడు నందూరు శ్రీనివాస్ అన్నారు. వాసవీ శాంతిధాంలోని పంచలో విగ్రహ ప్రతిష్టాపన నాలుగో వార్షికోత్సవాలు సందర్భంగా ఆదివారం వాసవీ మాతను దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. విశ్వమంతటికి మాతగా జేజేలు అందుకుంటున్న వాసవీ మాత దర్శనం సకల శుభాలను ఇస్తోందన్నారు. వాసవీ జన్మస్థలమైన పెనుగొండలో 90 అడుగుల పంచలోహ విగ్రహం నెలకొల్పడం అభినందనీయమన్నారు. ఇంతటి విగ్రహం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. వాసవీ శాంతిధాంలో ప్రతిష్టాపన చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల విశిష్టతను వివరించారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గోవిందరాజులు నందూరి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కోట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేఆర్ కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన బల్ల పూజలు


రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు, గవరపేట రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బల్లపూజలు ఆదివారంతో ముగిశాయి. దీనిలో భాగంగా పై గ్రామాలకు చెందిన రజకులు గ్రామోత్సవం నిర్వహించారు. కాలువలోనూ, చెరువులోను రజకులు ఉపయోగించుకునే బల్లలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. సంఘ అధ్యక్షుడు ఆదుర్తి శివరావు, ఉపాధ్యక్షుడు దేవాడ నీలవెంకటేశ్వరరావు, అంతర్వేదిపాలెం ఛాముండేశ్వరరావు, లంకా నరసింహమూర్తి, పొలిమేర సాయి, దేవాడ లక్ష్మణేశ్వరరావు బల్లలకు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం. సూర్యతేజ స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు తెలిపాయి. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్‌కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని చెప్పారు.

ఘనంగా అమ్మవార్ల జాతర


కాళింగగూడెంలో జాతరలో జలాభిషేకానికి తరలివెళుతున్న మహిళలు

ఆకివీడు: మండలంలోని కాళింగగూడెంలో గంగానమ్మ, పెద్దింటి అమ్మవార్ల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు బిందెలతో జలాన్ని తీసుకుని ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. ముగ్రాట పాడుకున్న బొద్దుపల్లి అప్పనపల్లి కుటుంబం, బొద్దుపల్లి శ్రీనివాస్ (గెటప్ శ్రీను) కుటుంబం తొలుత అమ్మవారికి జలాభిషేకం చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలు బిందెలతో తీసుకువచ్చిన జలాన్ని అమ్మవార్లకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకున్న పీవీఎల్ మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించే విధంగా గ్రామదేవతల ఆశీస్సుల కోసం జాతరలు జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గ్రామ దేవతల్ని శాంతింపజేయడంతో చెడు ప్రభావాలు పోతాయన్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో కొల్లేరు తీరంలోని కాళింగగూడెం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ముగ్రాట పాడుకున్న గెటప్ శ్రీను మాట్లాడుతూ కొల్లేరు తీరంలో ఏటా వరదలకు ఈ ప్రాంతం జలమయమయ్యేదని చెప్పారు. శ్రీకాకుళం ప్రాంతం నుంచి వలస వచ్చిన కాళింగులంతా ఓల్డ్ వయ్యేరు కాలువ గట్టు ప్రాంతంలో నివసిస్తూ ఇక్కడ కాళింగగూడెంగా గ్రామాన్ని ఏర్పరుచుకున్నామని చెప్పారు. సుమారు 50 ఏళ్ల క్రితం వరదలకు పాడి పంటలే కాకుండా ప్రాణనష్టం కూడా జరుగుతుండటంతో ప్రజలు గంగానమ్మ, పెద్దింటి అమ్మను కొలుస్తూ వచ్చారు. ఏటా అమ్మవార్లకు పెద్ద ఎత్తున జాతర చేస్తుండటంతో గంగానమ్మ శాంతించిందని గెటప్ శ్రీను చెప్పారు. ఈ సందర్భంగా పీవీఎల్ నర్సింహరాజును, నాయకులను గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కిల్లి రామకృష్ణ సత్కరించారు. గెటప్ శ్రీనును పీవీఎల్ సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యులు బొద్దుపల్లి రోహిణీ, హనుమంతు మధుసూదనరావు, సనపన నాగరాజు, మూల జగదీష్, గుంట వెంకటేశ్వరరావు, పమిడి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు జగ్గరోతు విజయ్‌కుమార్, తంగి పుష్కరరావు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, గుండుగొలను ధనరాజు, జామి శ్రీనివాస్, షేక్ హుస్సేన్, తోట శివాజీ, చిట్టిబాబు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం జరిపిస్తున్న ఆచార్యులు


సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్త జనసమూహం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ సీతారామ లక్ష్మణ సహిత పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఆగమ పండితులు కొదమసింహం భరద్వాజ్ ఆచార్యుల యాజ్ఞకంలో ముడుంబై వెంకటాచార్యులు సేవాకాలం, చక్రవర్తుల సంతోష్ కుమారాచార్యులు వ్యాఖ్యానం, నల్లాన్ చక్రవర్తుల వాసుదేవ ఫణీల గానంతో స్వామి వారి కల్యాణం జరిపించారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధానార్చకులు రమణ, రఘు స్వాముల ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణ ఉత్సవ కమిటీ, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సేవా సమితి సభ్యులు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.